**Sakshi**

# ఆబ్జెక్టివ్‌లో నెగటివ్ మార్క్కుల



ఏపీపీఎస్సీ బోర్డు సమావేశం తరువాత సభ్యులతో కలసి మీడియాతో మాట్లాడుతున్న చైర్మన్ ఉదయ్‌భాస్కర్

## తప్పు సమాధానానికి 1/3 మార్కుల కోత

- నెలాఖరులోపు 256 పోస్టులకు నోటిఫికేషన్
- ప్రకటన ఆలస్యమైతే వయోపరిమితి పొడిగింపు కోసం ప్రభుత్వానికి లేఖ
- ఏపీపీఎస్సీ పాలకమండలి భేటీలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా వివిధ పోస్టుల భర్తీకి ఆబ్జెక్టివ్ ప్రశ్నల విధానంలో నిర్వహించే అన్ని పోటీ పరీక్షలకు నెగటివ్ (మైనస్) మార్కుల విధానాన్ని అమలు చేయాలని కమిషన్ నిర్ణయించింది. తప్పుడు సమాధానం గుర్తిస్తే ఒక్కో ప్రశ్నకు 1/3 మార్కు చొప్పున తగ్గించనుంది. యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ తరహా విధానాన్ని అనుసరించనుంది. సరైన సమాధానాలు రాకున్నా కొందరు అభ్యర్థులు తెలియని వాటికి కూడా ఏదో ఒక ఆప్షన్ సమాధానాన్ని గుర్తిస్తూ అదృష్టవశాత్తు అది కరెక్టు అయితే అధిక మార్కులు పొందుతున్నారు. దీనివల్ల నిజంగా కష్టపడి చదివినవారు నష్టపోతున్నారు. దీన్ని నిరోధించడానికి నెగటివ్ మార్కుల విధానాన్ని ఎంచుకోవాలని మంగళవారం జరిగిన ఏపీపీఎస్సీ బోర్డు సమావేశం నిర్ణయించింది. చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు సీతారామరాజు, ప్రొఫెసర్ జి.రంగజనార్దన్, ప్రొఫెసర్ కె.పద్మరాజు, గుర్రం సుజాత, కె.విజయకుమార్, రూప, కార్యదర్శి వైవీఎస్‌టీ సాయి పాల్గొన్నారు. సమావేశానంతరం చైర్మన్, ఇతర సభ్యులు మీడియాతో మాట్లాడుతూ బోర్డు తీసుకున్న పలు కీలక నిర్ణయాలు వివరించారు.

- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరిగిన 1999 గ్రూప్-2 మెరిట్ జాబితా తయారీ, 2011 గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఫలితాల వెల్లడిపై చర్చించారు. 2011 గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాలను రెండునెలల్లోపు విడుదల చేయనున్నారు.
- ప్రభుత్వం అనుమతించిన 4,009 ఖాళీ పోస్టులలో 748 ఏఈఈ పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ వెలువరించినా ఇతర పోస్టులకు సంబంధించి చర్యలు వేగిర పర్చాలని నిర్ణయించారు.
- ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితిని 34 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం గతంలో జీఓ ఇచ్చింది. ఆ వయోపరిమితి గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులకు ఇంకా నోటిఫికేషన్లు జారీచేయాల్సి ఉన్నందున ఆ నోటిఫికేషన్లు

మిగతా 5వ పేజీలో ▶

# ఆబ్జెక్టివ్‌లో నెగటివ్ మార్క్కు

▶ మొదటి పేజీ తరువాయి

విడుదల జాప్యమైతే వయోపరిమితి పెంపు జీఓను మరో ఏడాది పొడిగింపునకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. గ్రూప్2 పోస్టులు 750, గ్రూప్3లో పంచాయతీ కార్యదర్శుల పోస్టులు 1,056 పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల చేయాల్సి ఉంది. ఈ నోటిఫికేషన్లు ఆలస్యమై మరో ఏడాది సమయం పట్టే పక్షంలో ప్రస్తుతం వయోపరిమితి మించి పోయేవారు కూడా ఆపోస్టులకు దరఖాస్తు చేసుకొనేలా అర్హత కల్పిస్తూ కొత్త ఉత్తర్వుల కోసం ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనివల్ల ఈనెలాఖరుతో 40 ఏళ్లు నిండిపోయే వారికి రానున్న ఏడాదిలో విడుదలయ్యే అన్ని నోటిఫికేషన్లకు అర్హత కల్పించనున్నారు.

- ఈనెలాఖరులోగా వివిధ విభాగాలకు సంబంధించిన 256 పోస్టులకు కొత్త నోటిఫికేషన్లు ఇవ్వనున్నారు. అసిస్టెంట్ ఇంజనీర్లు 199, అసిస్టెంట్ హైడ్రాలజిస్టు 9, అసిస్టెంట్ హైడ్రోజియోలజిస్టు 12, టెక్నికల్ అసిస్టెంటు (హైడ్రాలజీ) 5, టెక్నికల్ అసిస్టెంట్ (హైడ్రోజియోలజీ)13, వెల్ఫేర్ ఆర్గనైజర్ 6, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ 7, ల్యాబ్ అసిస్టెంటు 3, డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు 2 పోస్టులు ఈ నోటిఫికేషన్లో ఉండనున్నాయి.
- ఏ కేటగిరీలోనైనా అభ్యర్థుల సంఖ్య 25వేలకు మించితే స్క్రీనింగ్ టెస్టు మెయిన్ టెస్టు కంప్యూటరాధారితంగా పెట్టనున్నారు. ఇక నుంచి ఇచ్చే నోటిఫికేషన్లకు దాదాపు అన్నిటికీ స్క్రీనింగ్ టెస్టు ఉంటుంది. గ్రూప్-1 మెయిన్స్‌లో మినహాయించి తక్కిన అన్ని గ్రూపుల్లోనూ స్క్రీనింగ్ టెస్టు, మెయిన్స్ కంప్యూటరాధారిత ఆబ్జెక్టివ్ తరహా విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు.
- స్క్రీనింగ్ టెస్టునుంచి 1:50 చొప్పున అభ్యర్థులను రోస్టర్‌తో సంబంధం లేకుండా మెరిట్ ప్రాతిపదికన మెయిన్ పరీక్షకు ఎంపిక చే స్తారు. కటాఫ్ మార్కును నిర్ణయించి ఆమేరకు ఎంతమంది అర్హులో అందరినీ మెయిన్‌కు పిలుస్తారు. కొద్దికాలంలో దీన్ని కూడా మార్పు చేసి యూపీఎస్సీ తరహాలో స్క్రీనింగ్ టెస్టునుంచి మెయిన్స్‌కు 1:12, లేదా 1:13 చొప్పున రోస్టర్ తదితర రిజర్వేషన్లను అనుసరించి అభ్యర్థులను పిలవాలని సమావేశంలో చర్చించా రు. ఈమేరకు ప్రభుత్వానికి లేఖ రాయనున్నారు.
- ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన 748 ఏఈఈ పోస్టులకు స్క్రీనింగ్ టెస్టుతో పాటు మెయిన్ పరీక్షను ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్లో నిర్వహించనున్నారు. ఈ టెస్టు అక్టోబర్‌లోనే నిర్వహించేలా షెడ్యూల్ ఇవ్వనున్నారు.
- స్క్రీనింగ్ టెస్టు, మెయిన్ టెస్టుకు ఒకే తరహా సిలబస్ ఉంటుంది. మెయిన్ టెస్టులో మూడు పేపర్లు ఉంటాయి. ఈ మూడింటి నుంచి 50 మార్కుల చొప్పున 150 మార్కులకు స్క్రీనింగ్ టెస్టును నిర్వహిస్తారు. ప్రశ్నలు స్క్రీనింగ్ టెస్టు, మెయిన్ టెస్టులో ఒకే తరహాలో ఉంటాయి. ప్రశ్నలు, సమాధానాల ఆప్షన్లు జంబ్లింగ్ విధానంలో ఉంటాయి.
- గ్రూప్-2లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఈసారి ఇంటర్వ్యూలు ఉండవు. వచ్చే ఏడాదినుంచి గ్రూప్-2లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులను గ్రూప్-1లో కలిపి గ్రూప్-1 బీగా భర్తీచేస్తారు. వీటికి ప్రిలిమ్స్, మెయిన్స్ (డిస్క్రిప్టివ్)తో పాటు ఇంటర్వ్యూలూ ఉంటాయి.
- గ్రూప్-1 పోస్టుల కొత్త నోటిఫికేషన్లు, భర్తీ డిసెంబర్‌నాటికి చేపట్టనున్నారు.
- ఏపీపీఎస్సీ కార్యాలయానికి అమరావతిలో నాలుగు ఎకరాల స్థలం కావాలని ప్రభుత్వాన్ని అడిగారు. ప్రభుత్వం ఇస్తే భవనాన్ని నిర్మించి 2018 నాటికి కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తారు. లేనిపక్షంలో 2017 ఏప్రిల్‌కు అమరావతి పరిధిలో అద్దె భవనాల్లోకి ఏపీపీఎస్సీని తరలిస్తారు.